తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక


epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:68

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 07.11.2026 శనివారం, హైదరాబాద్

రేవంత్ సర్కార్ అవినీతిపై పోరాటం చేస్తా

- ఆధారాలతో బయటపెడతా డిసెంబర్ 7, 8 గ్లోబల్ సమిట్‌పైనా కేపీ పాల్ విమర్శలు
- ఆరు గ్యారెంటీల పేరుతో నిరుద్యోగులు, రైతులకు మోసం



2లో

ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్



- సెమీకండక్టర్ రంగంలో మరో ముందడుగు
- వ్యవసాయం, వైద్యం, విద్యలో ఏఐ వినియోగానికి ప్రాధాన్యం
- సెమికాన్ 2.0 వెబ్ పోర్టల్ ప్రారంభించిన
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రపంచ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్‌ను తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వ్యవసాయం, వైద్యం, విద్య వంటి కీలక రంగాల్లో ఏఐ సాంకేతికతను విస్తృతంగా వినియోగించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో సెమికాన్ 2.0 వెబ్ అప్లికేషన్ పోర్టల్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

ప్రపంచవ్యాప్తంగా ఏఐ, సెమీకండక్టర్ రంగాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని మంత్రి పేర్కొన్నారు. పంటల నిర్వహణ, వైద్య సేవలు, విద్యాబోధన వంటి రంగాల్లో ఆచరణాత్మక ఏఐ మోడళ్ల అభివృద్ధికి భారత్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విదేశీ సంస్థలతో పోటీపడుతూ ఏఐ అప్లికేషన్ల అభివృద్ధిలో భారత పరిశ్రమలు ముందుకు

।మిగతా 2 లో।



పిలిచినా పలకని నేతలు..?

ఏఐసీసీకి మహేశ్ గౌడ్ నివేదిక

- దామోదర్ రాజనర్సింహ, తోట లక్ష్మీకాంతరావు మధ్య వివాదంపై కాంగ్రెస్ సీరియస్..
- ఇద్దరి మధ్య విభేదాలపై ఏఐసీసీ ఆరా..
- నివేదిక పంపేందుకు సిద్ధమైన పీసీసీ
- డీసీసీ అధ్యక్షుడి నియామకంతో మొదలైన వివాదం.. బహిరంగంగా రచ్చకెక్కిన విభేదాలు
- పార్టీ క్రమశిక్షణను పక్కనపెడుతున్న నేతల తీరుపై అధిష్ఠానం గుర్రు
- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరుతో కాంగ్రెస్‌లో అంతర్గత కలకలం
- వరుస వివాదాలతో పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారిన నేతల వ్యవహారం
- అధిష్ఠానం తదుపరి చర్యలపై ఉత్కంఠ

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడి నియామక విషయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన ఎస్ఐఆర్ వ్యతిరేక సభకు తెలంగాణ నేతలు హాజరైన సమయంలో ఈ వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడి నియామకంపై చర్చించేందుకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్న హోటల్‌కు వెళ్లగా, ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా మంత్రి తనను వ్యక్తిగతంగా దూషించడమే కాకుండా, తీవ్ర పరిణామాలు

।మిగతా 2 లో।

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య నెలకొన్న వివాదంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు గురువారం గాంధీభవన్‌కు హాజరుకావాలని ఇద్దరు నేతలను పిలిచినా వారు రాకపోవడంతో పీసీసీ చీఫ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసి ఏఐసీసీకి పంపేందుకు ఆయన సిద్ధమైనట్లు సమాచారం.

ఓట్ల చోరీ కాదు.. పౌరుల హక్కుల చోరీ!

- సంక్షేమ పథకాలకు ఓటర్ ఐడీని ముడిపెట్టడంపై
- రాహుల్ గాంధీ ఆగ్రహం
- ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి లక్షలాది పేర్ల తొలగింపు ఆరోపణ
- రేషన్, పెన్షన్, ఉపాధి హామీ పథకాలకూ ఇదే విధానం అమలు చేస్తారా?



ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్ కార్డుకు బదులుగా ఓటర్ ఐడీని ప్రామాణికంగా తీసుకోవాలన్న ప్రతిపాదనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఓట్ల చోరీ మాత్రమే కాదని, దేశ పౌరుల ప్రాథమిక హక్కులను హరించే కుట్ర అని ఆరోపించారు.

న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

బీజేపీకి అనుకూలంగా ఓటర్ల జాబితాలను రూపొందించి, అదే జాబితా ఆధారంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలా వద్దా అని నిర్ణయించే పరిస్థితి తీసుకొస్తున్నారని విమర్శించారు. కేంద్రమంత్రి లలన్ సింగ్ ఆధార్‌కు బదులుగా బయోమెట్రిక్, ఓటర్ ఐడీ ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలన్న అంశంపై మాట్లాడిన వీడియోను రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.

।మిగతా 2 లో।

కరెంటు లేదు.. సాగునీరు అందడం లేదు!

- హరీశ్ రావు ఎదుట కన్నీటిపర్యంతమైన రైతులు
- నర్సాపూర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి పర్యటన.
- ఏడెకరాల వరి పంట ఎండిపోయిందంటూ రైతు ఆవేదన
- రైతులకు అండగా ఉంటాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

2లో



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక, సాగునీరు అందక చేతికొచ్చిన వరి పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో

కల్తీ పాల తయారీ కేంద్రంపై పోలీసుల దాడులు

- 100 లీటర్ల పాలు సీజ్
- హైడ్రోజన్ పెరాక్సైడ్, పాలపొడితో కృత్రిమ పాల తయారీ
- ప్రధాన నిందితుడి అరెస్ట్..
- హైదరాబాద్‌కు కల్తీ పాలు సరఫరా చేస్తున్నట్లు గుర్తింపు

2లో



బీజేపీ ప్రాబల్య ప్రాంతాలపై బీఆర్ఎస్ గురి..

- వరుస సభలకు కార్యాచరణ!
- నవంబర్‌లో భారీ బహిరంగ సభలకు గులాబీ పార్టీ సన్నాహాలు
- నిర్మల్, నిజామాబాద్, మానకొండూరులో కీలక కార్యక్రమాలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా సమస్యల అజెండాతో పోరాటానికి సిద్ధం

2లో

కరెంటు లేదు.. సాగునీరు అందడం లేదు!

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక, సాగునీరు అందక చేతికొచ్చిన వరి పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చేపట్టిన పర్యటనలో రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. పలువురు రైతులు పంట నష్టాన్ని వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు.సకాలంలో విద్యుత్ సరఫరా లేక తన ఏడెకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయిందని కుమార్ అనే రైతు హరీశ్ రావు ఎదుట కన్నీటితో వాపోయారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందడంతో రెండు పంటలు పండించుకునేవారమని, ప్రస్తుతం కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో



కూరుకుపోతున్నా కాంగ్రెస్ నాయకులు కనీసం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. రైతుబంధు నిధులు పూర్తిస్థాయిలో అందలేదని, కేవలం ఒక్క ఎకరానికే జమ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని వాపోయారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ హామీ అమలులోనూ తమకు న్యాయం జరగలేదని, గ్రామంలోని పది మందిలో కనీసం ఒక్కరికైనా రుణమాఫీ కాలేదని రైతులు హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు.

రైతులకు అండగా ఉంటాం: హరీశ్ రావు

కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మి మోసపోయామని, తిరిగి కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే తమ కష్టాలు తీరుతాయని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు అధైర్యపడవద్దని హరీశ్ రావు భరోసా ఇచ్చారు.మరో రెండేళ్ల పాటు రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అందించిన 24 గంటల విద్యుత్, రైతుబంధు పథకాలను నిలిపివేసి పచ్చని పొలాలను ఎండబెట్టడమేనా కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న మార్పు? అని ప్రశ్నించారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి నష్టపరిహారం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులు విడుదల చేయడంతో పాటు పూర్తిస్థాయి రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సీఎం రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తెచ్చి రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని హరీశ్ రావు హెచ్చరించారు.



పిలిచినా పలకని నేతలు..

తరువాయి భాగం

ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ విషయంపై పార్టీ అధిష్ఠానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య వివాదం బహిరంగంగా చర్చకు రావడంతో కాంగ్రెస్ నాయకత్వం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఉన్నత పదవుల్లో ఉన్న నేతలు బహిరంగంగా విభేదించుకోవడం పార్టీకి ఇబ్బందికరంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో ఇద్దరూ గాంధీభవన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. అయితే, పిలుపునిచ్చినా ఇద్దరూ హాజరుకాకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఏఐసీసీకి నివేదిక పంపనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్‌లో వరుసగా అసమ్మతి స్వరాలు

రాష్ట్ర కాంగ్రెస్‌లో నేతల మధ్య విభేదాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇటీవల పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి శ్రీధర్ బాబు వ్యవహారంపై చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. మరోవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. నియోజకవర్గానికి నిధులు కేటాయించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇక జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సైతం తన నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. పలువురు నేతలు ప్రభుత్వ పనితీరు, నిధుల కేటాయింపులపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తుండటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

అధిష్ఠానం తదుపరి చర్యలపై ఉత్కంఠ

ఒకవైపు ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న మంత్రులు, మరోవైపు ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేస్తుండటంతో తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల అంశం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. పీసీసీ చీఫ్ నివేదిక అనంతరం ఏఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? గాంధీభవన్‌కు హాజరుకాని మంత్రి, ఎమ్మెల్యే వ్యవహారంపై పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుంది? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

ఓట్లు చోరీ కాదు.. పౌరుల హక్కుల చోరీ!

తరువాయి భాగం

ఓటు అనేది పౌరుల హక్కు మాత్రమేనని, పేదవారి పెన్షన్‌ను ఓటర్ కార్డుకు బానిసగా మార్చకూడదని స్పష్టం చేశారు. ఈ హక్కుల చోరీని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) పేరుతో లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ప్రక్రియను అడ్డుకోకపోతే భవిష్యత్తులో మరింత మంది ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించాలని భావించే వారి పేర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే అవకాశం ఉందని విమర్శించారు.

ఓటు హక్కు కోల్పోతే ప్రజాస్వామ్యంలో పౌరుల భాగస్వామ్యం దెబ్బతింటుందని, చివరకు ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునే వ్యవస్థకు బదులుగా ప్రభుత్వమే తనకు నచ్చిన ప్రజలను ఎంపిక చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ పథకాలతో ప్రారంభించి, భవిష్యత్తులో రేషన్, పెన్షన్లు, ఉపాధి హామీ, ఇళ్లు, స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్లకు కూడా ఓటర్ ఐడీని తప్పనిసరి చేస్తారా? అని ప్రశ్నించారు.

ఓటర్ల జాబితాల నిర్వహణ నిష్పక్షపాతంగా జరగాలని, ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కూడా విమర్శలు గుప్పించారు.

కాలుష్య నివారణకు తక్షణ సంస్కరణలు అవసరం

మరోవైపు, దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్ర ప్రజారోగ్య సమస్యగా మారుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వాయు కాలుష్య నియంత్రణకు దాదాపు ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన జాతీయ స్వచ్ఛ వాయు



కార్యక్రమంలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (CREA) విశ్లేషణను ప్రస్తావిస్తూ, కొన్ని ప్రాంతాల్లో కాలుష్యం కారణంగా ప్రజారోగ్య సంక్షోభం మరింత తీవ్రమవుతోందని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం

దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, అప్పుల భారంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. మోదీ ప్రభుత్వ పాలనలో ద్రవ్యోల్బణం కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనం భారంగా మారిందని జైరాం రమేశ్ విమర్శించారు. కూరగాయలు, పండ్లు, పప్పులు, వంట నూనె, పాలు, పిండి వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యుల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో బీజేపీని ఓడించడం ద్వారా ధరల పెరుగుదలపై ప్రజలు తమ నిరసనను తెలియజేయాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది.



బీజేపీ ప్రాబల్య ప్రాంతాలపై

బీఆర్ఎస్ గురి..

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణ రూపొందిస్తోంది. ముఖ్యంగా బీజేపీ ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వరుస సభలు,సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది.రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే రాజకీయ సమీకరణాలపై దృష్టి సారించిన గులాబీ పార్టీ.. ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా చేసుకుని క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని భావిస్తోంది.

బీజేపీ ప్రాబల్య ప్రాంతాలే లక్ష్యంగా..

బీజేపీకి రాజకీయంగా పట్టున్న ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చకు కేంద్రంగా నిలవాలని బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తోంది. ఇప్పటికే రామగుండంలో సింగరేణి గర్జన, ఆదిలాబాద్‌లో రైతు గర్జన నిర్వహించిన పార్టీ.. రానున్న రోజుల్లో మరిన్ని బహిరంగ సభలకు సిద్ధమవుతోంది.రైతులసమస్యలు,సింగరేణి కార్మికుల ఇబ్బందులు,ప్రభుత్వ విధానాలు,కాంగ్రెస్ ఎన్నికలహామీల అమలువంటిఅంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనిర్ణయించింది.

నవంబర్‌లో వరుస సభలు

ఈ నెల 11న నిర్మల్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలను చేర్చుకునే అంశానికి కూడా ప్రాధాన్యత ఇవ్వనుంది. అనంతరం ఈ నెల 18న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మరో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ప్రశ్నలు సంధించాలని పార్టీ భావిస్తోంది.అలాగే దీక్షా దివస్ సందర్భంగా ఈ నెల 29న మానకొండూరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. 2009లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నిరాహార దీక్ష చేపట్టిన సమయంలో ఆయనను అరెస్ట్ చేసిన అలుగునూరు చౌరస్తా వద్ద ఈ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొననున్నారు.

ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి..

దీక్షా దివస్ కార్యక్రమం ద్వారా తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్రను గుర్తుచేస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతో పాటు, స్థానిక సమస్యలను రాష్ట్రస్థాయి రాజకీయ అంశాలుగా మార్చే ప్రయత్నం చేయనుంది.ఒక ప్రాంతంలో నిర్వహించే సభ ద్వారా చుట్టుపక్కల నియోజకవర్గాలపైకూడా ప్రభావం చూపచ్చని పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది.

కాంగ్రెస్‌పై విమర్శల పదును

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, రైతుల సమస్యలు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలను మరింత తీవ్రం చేయాలని బీఆర్ఎస్ భావిస్తోంది. రైతులు, కార్మికులు, ఇతర వర్గాల సమస్యలపై పోరాటాలను విస్తరించడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా కార్యాచరణ రూపొందిస్తోంది.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

వరుస సభలు, సమావేశాల ద్వారా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించడం, బీజేపీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో రాజకీయ కార్యకలాపాలను విస్తరించడం వంటి అంశాలపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమ రాజకీయ కార్యాచరణకు అనుసంధానించుకోవాలని పార్టీ నాయకత్వం ప్రయత్నిస్తోంది. రాబోయే ఎన్నికలకు ముందుగానే క్షేత్రస్థాయిలో పార్టీని సిద్ధం చేసుకునే దిశగా గులాబీ పార్టీ అడుగులు వేస్తోంది.

ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్

తరువాయి భాగం

సాగుతున్నాయని తెలిపారు.

సెమికాన్ 2.0 పోర్టల్‌తో మరింత పారదర్శకత

సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు, తయారీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సెమికాన్ 2.0 పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పోర్టల్‌లో పూర్తి వివరాలతో సమర్పించిన దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు.వాస్తవంగా పెట్టుబడులు పెట్టి ప్రాజెక్టులను అమలు చేయాలనే నిబద్ధత కలిగిన సంస్థలకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. అసంపూర్తి దరఖాస్తులకు అవకాశం లేదని, అర్హత లేని 18 నుంచి 19 కంపెనీలను తొలగించాలని ఐటీ శాఖ కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిపారు.దేశీయంగా గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (GPU) చిప్‌ను అభివృద్ధి చేసే రోడ్‌మ్యాప్ కూడా తుది దశకు చేరుకుంటోందని మంత్రి వెల్లడించారు.

రూ.7,500 కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం

ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ECMS) కింద మరో 12 దరఖాస్తులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.7,500 కోట్లకు పైగా ఉందన్నారు. ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, ముడి పదార్థాలు, తయారీ యంత్రాలు, పరికరాల ఉత్పత్తికి సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయని తెలిపారు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ వ్యవస్థను బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఆమోదం పొందిన యూనిట్లలో 50 శాతం చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (SMEs), సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (MSMEs) ఉన్నాయని మంత్రి తెలిపారు.ఒకప్పుడు భారత్‌లో మొబైల్ ఫోన్ల తయారీ కేవలం అసెంబ్లింగ్‌కే పరిమితమవుతుందని విమర్శలు వచ్చాయని, ప్రస్తుతం మాడ్యూల్స్, విడిభాగాలు, ముడి పదార్థాల తయారీ వరకు దేశీయ పరిశ్రమలు విస్తరించాయని అశ్విని వైష్ణవ్ వివరించారు.

సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం సూచనలు

పిల్లలు, మహిళల భద్రతకు సోషల్ మీడియా సంస్థలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇతర ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, నేరుగా తమ సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందేలా ఫిర్యాదుల వ్యవస్థ ఉండాలని మంత్రి అభిప్రాయపడ్డారు. ఏఐ, సెమీకండక్టర్ రంగాల్లో దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలపడంతో పాటు డిజిటల్ భద్రతను బలోపేతం చేయడంపై కేంద్రం దృష్టి సారించినట్లు ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

కల్తీ పాల తయారీ కేంద్రంపై

పోలీసుల దాడులు

తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్ :

రంగారెడ్డి జిల్లాలో కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా పలు బ్రాండ్ల పేర్లతో విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేయగా.. తాజాగా కల్తీ పాల తయారీ కేంద్రంపై మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని ఓ ఇంట్లో కృత్రిమంగా కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. అందే శ్రీశైలం అనే వ్యక్తి ప్రధాన నిందితుడిగా ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు తేలింది. పాలలో ప్రమాదకరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్, ధోల్వార్ పాలపొడిని కలిపి కృత్రిమ పాలను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా తయారుచేసిన పాలను హైదరాబాద్‌లోని వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.

ఆకస్మిక దాడుల్లో పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఘటనా స్థలం నుంచి 100 లీటర్ల కల్తీ పాలు, ఒక లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్, 35 కిలోల ధోల్వార్ పాలపొడిని స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్కటి కిలో బరువున్న 35 పాలపొడి ప్యాకెట్లను సీజ్ చేశారు.కల్తీ పాలను ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు? రసాయనాలను ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? ఈ అక్రమ వ్యాపారం వెనుక మరెవరైనా ఉన్నారా? అనే



కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌కు సరఫరా అవుతున్న కల్తీ పాల నెట్‌వర్క్‌ను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు.

వరుసగా కల్తీ బియ్యం, కల్తీ పాల తయారీ కేంద్రాలు వెలుగులోకి వస్తుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

రేవంత్ సర్కార్ అవినీతిపై పోరాటం చేస్తా

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులు, రైతులను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమిట్‌పైనా కేఏ పాల్ విమర్శలు చేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గతంలో అంతర్జాతీయ స్థాయిలో తాను నిర్వహించిన సమావేశాలకు ప్రపంచ నాయకులు, ప్రముఖులు హాజరయ్యారని పేర్కొన్నారు. డిసెంబర్‌లో జరిగే కార్యక్రమానికి అంతర్జాతీయ ప్రముఖులను తీసుకురావడంపై కాంగ్రెస్ నాయకులు కేసీ వేణుగోపాల్, సల్మాన్ ఖుర్షీద్, మల్లు రవితో చర్చించినట్లు వెల్లడించారు.



కోర్టు తీర్పులను పాటించడం లేదు

రాష్ట్రంలో న్యాయస్థానాలకు సంబంధించిన కేసులు, ప్రాసిక్యూటర్ల వ్యవహార శైలిపై కూడా కేఏ పాల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశాలకు సంబంధించిన వివరాలను ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లేలా వీడియోలు విడుదల చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి అవినీతి వీడియోలు విడుదల

రేవంత్ రెడ్డి ప్రభుత్వ అవినీతిని ప్రజల ముందుకు తీసుకొస్తానని కేఏ పాల్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తనకు మద్దతుగా నిరుద్యోగులు, విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటుకు నోటు కేసుతో పాటు ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలకు సంబంధించిన వీడియోలను రేపటి నుంచి వరుసగా విడుదల చేస్తానని ప్రకటించారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతారని తాను ముందుగానే అంచనా వేసినట్లు కేఏ పాల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపైనా తన అభిప్రాయాలను వెల్లడించారు.





కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచి..

- ఘనంగా బీజేపీ నేత నల్ల మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. పలుచోట్ల అన్నదానాలు
- బర్త్ డే సందర్భంగా ఆరు మండలాలలో పండ్ల పంపిణీ, పలు సామాజిక కార్యక్రమాలు
- నల్ల మనోహర్ రెడ్డికి బర్త్ డే విషెష్ తెలిపిన పలువురు నాయకులు, అభిమానులు

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలను పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుచరులు నియోజకవర్గంలోని ఆరు మండలాలలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. మొదటగా పెద్దాపూర్ మల్లికార్జున స్వామి దేవాలయం, యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం, జూలపల్లి శివాలయంలో నల్ల మనోహర్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ వేద పండితులతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి, సంబరాలు జరుపుకోవడంతో పాటు ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద నిర్వహించిన బర్త్ డే వేడుకలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నల్ల మనోహర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి గజమాలతో సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నల్ల మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..తన జన్మదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని ఆరు మండలాలలో వేడుకలు నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుచరులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు, ఆదరణ ఎంతో సంతోషాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ప్రజాసేవలో మరింత బాధ్యతతో ముందుకు సాగేందుకు కార్యకర్తల అభిమానం కొత్త ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. రాబోయే రోజుల్లో పెద్దపల్లిలో బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని, పెద్దపల్లిలో పార్టీ జెండా ఎగురవేయడానికి తన వంతు కృషి, సహకారం అందిస్తానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు, ప్రజల ఆశీస్సులు, సహకారం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఇక్కడ బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు పేంజర్ల రాకేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రామగిరి అఖిల్, మహిళా మోర్చా నాయకురాలు కూనారపు రేణుక, బండారి లత, భాగ్యలక్ష్మి, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నల్ల మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలలో యువకుల జోష్..

నియోజకవర్గంలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల మండలాలలో నిర్వహించిన నల్ల మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో బీజేపీలో నూతన ఉత్సాహం నెలకొందని పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు.

రైతన్న జీవితంలో ట్రాక్టర్‌ది చెరగని ముద్ర!



- వంగపల్లిలో ఘనంగా ప్రపంచ ట్రాక్టర్ యజమానుల దినోత్సవ వేడుకలు
- ట్రాక్టర్లతో గ్రామంలో సందడి.. ఐక్యత చాటిన యజమానులు

కమలాపూర్, తెలంగాణ చౌరస్తా:

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు ప్రతీకగా నిలుస్తూ, రైతన్న శ్రమకు చేదోడువాదోడుగా ఉంటున్న ట్రాక్టర్‌కు వంగపల్లి గ్రామంలో ఘనమైన గౌరవం లభించింది. ప్రపంచ ట్రాక్టర్ యజమానుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామంలో శుక్రవారం ట్రాక్టర్ యజమానులంతా ఐక్యంగా వేడుకలు నిర్వహించారు. తమ జీవన ప్రయాణంలో భాగమైన ట్రాక్టర్లతో గ్రామంలో ప్రత్యేక ర్యాలీ చేపట్టి సందడి చేశారు. ఒకప్పుడు ఎద్దులు, నాగళ్లే వ్యవసాయానికి ప్రధాన ఆధారం కాగా, ప్రస్తుతం యాంత్రీకరణతో ట్రాక్టర్లు రైతుల జీవితాల్లో అంతర్భాగంగా మారాయి. పొలం దున్నడం నుంచి పంటను ఇంటికి చేర్చడం వరకు ప్రతి దశలోనూ ట్రాక్టర్ల సేవలు కీలకంగా మారాయి. వ్యవసాయ పనులతోపాటు రవాణా, నిర్మాణ రంగాల్లోనూ ట్రాక్టర్లు ముఖ్యపాత్ర పోషిస్తూ రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయి.

రైతన్నకు ట్రాక్టర్ ఓ యంత్రం కాదు.. కుటుంబ సభ్యుడు!

రైతు జీవితంలో ట్రాక్టర్‌కు ఉన్న అనుబంధం మాటల్లో చెప్పలేనిదని యజమానులు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను కుటుంబ సభ్యుడిగా భావిస్తూ ప్రతి ప్రత్యేక సందర్భంలో పూజించి గౌరవిస్తామని తెలిపారు. రైతు కష్టానికి ప్రతిరూపంగా, పల్లె ప్రగతికి చిహ్నంగా ట్రాక్టర్ నిలుస్తోందన్నారు. అన్నం పెట్టే రైతన్నకు అండగా నిలుస్తున్న ట్రాక్టర్ల సేవలను గుర్తు చేసుకోవడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని వివరించారు.

'పంటలు పండించేది మనం..ప్రపంచానికి అన్నం పెట్టేది మనం' అనే సందేశంతో రైతన్న గొప్పతనాన్ని, ట్రాక్టర్ల ప్రాధాన్యతను చాటిచెబుతూ యజమానులంతా తమ ఐక్యతను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యజమానుల సంఘం అధ్యక్షుడు ముత్తయ్య, ఉపాధ్యక్షుడు పున్నం చందర్, కోశాధికారి ఎల్కటి అశోక్, గ్రామ పెద్దలు పెరుమాండ్ల రఘుపతి, ఎల్కటి రజినీకాంత్, ఆకునూరి విజయ్, పెనుకుల నరేందర్, ఏనుగుల సందీప్, కొలిపాక సురేష్‌తో పాటు పలువురు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పెర్క శ్యామ్ పరామర్శ

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

సింగరేణి ఎస్సీ,ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆర్ జి 3 ఉపాధ్యక్షులు,తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి,ఐఎన్టియుసి నాయకులు బత్తుల శంకర్ తల్లి బత్తుల వెంకటమ్మ (86) ఇటీవల పరమపదించిన విషయం తెలుసుకున్న టీపీసీసీ నాయకులు పెర్క శ్యామ్ వారి నివాసానికి వెళ్లి శంకర్ ని పరామర్శించారు.ఈ సందర్భంగా మాతృమూర్తి మరణం పట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.




బాధిత కుటుంబానికి పరామర్శ

జనగాం, తెలంగాణ చౌరస్తా:

జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన ఉద్యమకారుడు వేముల లక్ష్మణ గౌడ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవికుమార్ పరామర్శించారు.వారితో పాటు జనగామ జిల్లా అధ్యక్షులు బొల్లి పల్లె శ్రీనివాస్,రాష్ట్ర కార్యదర్శి కుడికాల భాస్కర్,రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జీ జినుకల లక్ష్మణరావు పటేల్,రాష్ట్ర కన్వీనర్ ఓడపల్లి శ్యాం కృష్ణ వారితో పాటు ఇతర జిల్లాల అధ్యక్షులు ,రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ప్రణవ్



హుజురాబాద్, తెలంగాణ చౌరస్తా:

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులతో నేరుగా మాట్లాడి వివరాలు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తీసుకున్నారు.హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...నియోజకవర్గం నలుమూలల నుండి పెద్దఎత్తున వైద్యసేవల కోసం వస్తారని వారికి అండగా,భరోసా ఇవ్వడానికి ఆసుపత్రికి వచ్చామని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యానికి పెద్దపేట వేస్తున్నామని,దానికి తగ్గట్టుగా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా రోగులు పలు సమస్యలు ప్రణవ్ దృష్టికి రాగా వాటిని పరిష్కరిస్తానని తెలిపారు.ఆసుపత్రి విషయంలో ఇప్పటికే జిల్లా కలెక్టర్,డిఎంహెచ్ఓ కు మాట్లాడడం జరిగిందని,ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దేవాపూర్‌లో రెండు వీవో భవనాలకు భూమిపూజ

కాసిపేట, తెలంగాణ చౌరస్తా :

బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకట్ స్వామి ఆదేశాల మేరకు దేవాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 11వ, 12వ వార్డుల్లో రెండు వీవో భవనాల నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. దేవాపూర్ గ్రామ సర్పంచ్ సిడాం రాందాస్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పన్నాల మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం కుమారి,ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రత్నం ప్రదీప్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో దేవాపూర్ గ్రామ ఉపసర్పంచ్ గుండ అనసూయ, వార్డు సభ్యులు,మద్దిమడ సర్పంచ్ ఆడే దివ్య జంగు,ఎంపీడీవో సత్యనారాయణ సింగ్,ఏపీఎం రాజ్‌కుమార్,సీసీ రాజమల్లు, ఏఈపీఆర్ జగన్,పంచాయతీ కార్యదర్శి కవిత,వీవో లీడర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

1000 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలి



- జీవో నంబర్ 31లోని నిబంధనలను సవరించాలి
- స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలి
- నిరుద్యోగ జేఏసీ డిమాండ్.. ఎస్ఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

తెలంగాణ చౌరస్తా | హైదరాబాద్:

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను పెంచి, కనీసం 1000 పోస్టులతో ఒకేసారి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 31లోని అభ్యర్థులకు ఇబ్బందికరంగా ఉన్న నిబంధనలను సవరించడంతో పాటు నియామకాల్లో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ డిమాండ్లతో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలు చేపట్టి దాదాపు 13 సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటికీ అనేక ఖాళీలు భర్తీ కాకపోవడం అందోళనకరమన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్ కేవలం ఏడు యూనివర్సిటీలకే పరిమితం కావడంతో పాటు, విభాగాల వారీగా ఖాళీల వివరాల్లో స్పష్టత లేదని పేర్కొన్నారు. కొన్ని విభాగాలకు తక్కువ పోస్టులు కేటాయించగా, మరికొన్ని విభాగాలకు అసలు పోస్టులే కేటాయించలేదని విమర్శించారు.

జీవో 31 నిబంధనలను సవరించాలి

పబ్లికేషన్లకు సంబంధించిన నిబంధనలు పేద, సామాన్య విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతున్నాయని ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. అర్హతల విషయంలో 1:10 నిబంధనతో అనేక మంది అభ్యర్థులు అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. జీవో నంబర్ 31లోని పార్ట్‌బి, వెయిటేజీ విధానానికి సంబంధించిన అంశాలను పునఃపరిశీలించి అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. యూనివర్సిటీల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న కనీసం వెయ్యి టీచింగ్ పోస్టులను ఒకేసారి భర్తీ చేసి ఉన్నత విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు.

ఫేజ్-1, ఫేజ్-2 పేరుతో కాలయాపన వద్దు

నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎల్. మూర్తి మాట్లాడుతూ.. కాంట్రాక్టు టీచర్లను మినహాయించి రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 1000కు పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వాటి భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడంతో పాటు స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఫేజ్ 1, ఫేజ్ 2 పేరుతో కాలయాపన చేయకుండా ఒకేసారి వెయ్యి పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అదే విధంగా ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్ల నిధులు కేటాయిస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలని, యూనివర్సిటీ అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి సంఘాల నేతల హాజరు

ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి అజయ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షులు కిరణ్, హర్షవర్ధన్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ శీను, పుష్పలీల, రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఉదయ్, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నేత డాక్టర్ శంకర్, రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆజాద్, ఎస్ఎస్‌యూఐ ఓయూ నేత శ్రీధర్, బీసీ విద్యార్థి నాయకులు డాక్టర్ అవ్వారు వేణు కుమార్, చేరాల వంశీ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు చిరంజీవి, డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్య ప్రకాష్‌తో పాటు పరిశోధక విద్యార్థులు మల్లేష్, విజయ్, రమేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

దేవాపూర్‌లో రెండు వీవో భవనాలకు భూమిపూజ

కాసిపేట, తెలంగాణ చౌరస్తా :

బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకట్ స్వామి ఆదేశాల మేరకు దేవాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 11వ, 12వ వార్డుల్లో రెండు వీవో భవనాల నిర్మాణానికి శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. దేవాపూర్ గ్రామ సర్పంచ్ సిడాం రాందాస్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పన్నాల మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం కుమారి,ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రత్నం ప్రదీప్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో దేవాపూర్ గ్రామ ఉపసర్పంచ్ గుండ అనసూయ, వార్డు సభ్యులు,మద్దిమడ సర్పంచ్ ఆడే దివ్య జంగు,ఎంపీడీవో సత్యనారాయణ సింగ్,ఏపీఎం రాజ్‌కుమార్,సీసీ రాజమల్లు, ఏఈపీఆర్ జగన్,పంచాయతీ కార్యదర్శి కవిత,వీవో లీడర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

"వేద పఠనం కంటే, సేద్యమే అత్యంత కఠినమైనది"

మన ప్రాచీన సంస్కృతిలో వేదాలకు అత్యున్నత స్థానం ఉంది. వేద మంత్రాలను ఉచ్చరించడం, కంఠస్థం చేయడం, వాటిలోని అంతరార్థాన్ని గ్రహించడం అంత తేలికైన విషయం కాదు. దానికి అపారమైన మేధస్సు, ఏకాగ్రత, క్రమశిక్షణ, నిరంతర సాధన కావాలి. అందుకే వేదాధ్యయనం అత్యంత పవిత్రమైన, కష్టసాధ్యమైన మార్గంగా భావిస్తారు. అయితే, నిశితంగా పరిశీలిస్తే సమాజానికి ప్రాణాధారమైన సేద్యం—అంటే వ్యవసాయం—చేయడం వేదం చదవడం కంటే ఎన్నో రెట్లు కఠినమైనది. ఇది శ్రమతో కూడుకున్నది మాత్రమే కాదు; ప్రకృతితో, పరిస్థితులతో ప్రతిరోజూ చేసే ఒక నిశ్శబ్ద యుద్ధం.

నియమబద్ధమైన విద్య - అనిశ్చితుల వ్యవసాయం

వేదాధ్యయనానికి నిర్దిష్టమైన నియమాలు, వ్యాకరణ పద్ధతులు, గురుశిష్య సంప్రదాయం ఉంటాయి. ఒక శ్లోకాన్ని ఎలా పలకాలో, స్వరాన్ని ఎక్కడ హెచ్చించాలో, ఎక్కడ తగ్గించాలో సూత్రాలు ఉన్నాయి. ఒకసారి ఆ విద్యను సాధన చేసి పట్టు సాధిస్తే, అది మేధస్సులో స్థిరపడుతుంది. అందులో ఫలితం సాధకుడి చేతుల్లో ఉంటుంది. ఎంత సమయం కేటాయిస్తే అంత పరిజ్ఞానం లభిస్తుంది.

కానీ వ్యవసాయం అలా కాదు. ఇక్కడ సూత్రాలు పనికిరావు, ఏవీ స్థిరంగా ఉండవు. సేద్యంలో ప్రతి అడుగు ఒక ప్రయోగం, ప్రతి క్షణం ఒక సవాలు.

***నేలను సిద్ధం చేయడం మొదలుకొని, విత్తనం నాటడం, నీరు పెట్టడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం వరకు ప్రతి దశలో అంతులేని శారీరక శ్రమ అవసరం.**

***ఒకరోజు ఉన్న వాతావరణం మరుసటి రోజు ఉండదు.**

***ఎంత అనుభవం ఉన్న రైతు అయినా మారుతున్న రుతువుల ముందు విద్యార్థిగానే నిలబడాల్సి వస్తుంది.**

ప్రకృతి కరుణపై ఆధారపడే జీవనం

వేదం చదివే పండితుడికి ప్రకృతి మార్పులు ఆటంకం కలిగించకపోవచ్చు. నాలుగు గోడల మధ్య కూర్చొని శాంతంగా మంత్రాలను వల్లెవేయవచ్చు. కానీ రైతు బతుకు పూర్తిగా ఆరుబయట, ఆకాశం వైపే చూస్తూ గడుస్తుంది.రైతు శ్రమకు ప్రకృతి సహకారం ఉంటేనే ఫలితం దక్కుతుంది. వానలు కురవకపోతే కరువు, అతిగా కురిస్తే వరదలు. ఒక్క రాత్రిలో కురిసిన అకాల వర్షం లేదా వడగళ్ళ వాన నెలల తరబడి పడ్డ కష్టాన్ని నేలమట్టం చేస్తుంది. క్రిమికీటకాలు, తెగుళ్ళు పంటను ఆశిస్తే రైతు గుండె చెరువవుతుంది. విత్తనం మొలకెత్తిన నాటి నుంచి పంట చేతికొచ్చే దాకా రైతు అనుభవించే మానసిక ఆందోళన వర్ణనాతీతం. ఇంతటి అనిశ్చితి, నిస్సహాయత మరే వృత్తిలోనూ కనిపించవు.

అనుభవమే అసలైన జ్ఞానం

వేదాన్ని గ్రంథాల ద్వారా, గురువు ఉపదేశం ద్వారా నేర్చుకోవచ్చు. కానీ సేద్యం ఏ పుస్తకమూ పూర్తిగా నేర్పించలేదు.

***చేతిలో మట్టిని పట్టుకుని దాని సారాన్ని పసిగట్టే నేర్పు,**

***ఆకాశంలోని మబ్బుల రంగును చూసి వర్షం ఎప్పుడు పడుతుందో ఊహించే విజ్ఞానం,**

***మొక్క ఆకు రంగు మారితే దానికి ఏ పోషకం తక్కువైందో గ్రహించే పరిశీలనా శక్తి...**

ఇవన్నీ రైతు స్వయంగా నేలతల్లితో మమేకమై సంపాదించుకున్న సహజ జ్ఞానం. రక్తాన్ని చెమటగా మార్చి, ఎండనకా వాననకా ఒంటిని కరిగించే ఈ శ్రమకు ఏ డిగ్రీలు, పీఠాలు సరితూగలేవు.

ఆర్థిక సంకెళ్లు, మార్కెట్ దోపిడీ

వేదం చదివిన వ్యక్తికి సమాజంలో గౌరవం, పూజార్హత, కనీస జీవన భరోసా లభిస్తాయి. కానీ కోట్లాది మంది ఆకలి తీర్చే రైతుకు ఆ భరోసా ఉందా అంటే సమాధానం శూన్యం.

విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, కూలీల ఖర్చులు పెట్టుబడిగా పెట్టి పంటను పండిస్తే, తీరా మార్కెట్‌కు వెళ్లాక దానికి గిట్టుబాటు ధర నిర్ణయించే హక్కు రైతుకు ఉండదు. దళారుల చేతుల్లో మోసపోవడం, పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోవడం నిత్యకృత్యమైంది. పంట చేతికి వచ్చినా లాభం రాదనే భయంకరమైన సత్యాన్ని మోస్తూ కూడా మళ్లీ మరుసటి ఏడు నాగలి పట్టి పొలానికి వెళ్లే గుండె ధైర్యం కేవలం రైతుకే సొంతం. ఆధ్యాత్మికత కంటే ఆకలి తీర్చే శ్రమే మిన్న

వేదాలు ఆత్మజ్ఞానాన్ని, పరమాత్మ తత్వాన్ని, ధర్మాన్ని బోధిస్తాయి. అవి సమాజానికి ఆధ్యాత్మిక మార్గాన్ని చూపుతాయి. కానీ ఆ మంత్రాలను ఉచ్చరించాలన్నా, ఆ ధర్మాన్ని పాటించాలన్నా మనిషికి ప్రాణం ఉండాలి. ఆ ప్రాణాన్ని నిలబెట్టేది రైతు పండించే ఒక్కో మెతుకు. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అంటారు. ఆ పరబ్రహ్మాన్ని సృష్టించేది, తన శరీర కణాలను కరిగించి లోకానికి అన్నం పెట్టేది రైతు మాత్రమే.

వేదం చదవడం మెదడుకు సంబంధించిన విద్య అయితే, సేద్యం చేయడం ప్రాణాన్ని పణంగా పెట్టే నిరంతర తపస్సు. మెదడుతో శ్రమించడం కష్టమే కావచ్చు, కానీ శరీరంతో, మనసుతో, ప్రకృతితో, దారిద్ర్యంతో ఒకేసారి పోరాడుతూ ప్రపంచానికి జీవనాధారంగా నిలవడం అంతకంటే ఎన్నో రెట్లు కఠినమైన పని. అందుకే వేద పఠనం కంటే, చేతిలో నాగలి పట్టి చెమటోడ్చే సేద్యమే అత్యంత కఠినమైనది, అంతకంటే మిన్నగా అత్యున్నతమైనది.

రక్తదానం ప్రాణదానంతో సమానం



- ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా శ్రీ చైతన్యలో మెగా రక్తదాన శిబిరం..
- 300 మందికి పైగా రక్తదానం

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు.మియాపూర్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మియాపూర్ సీఐ జయరాంతో పాటు మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రవికుమార్‌తో కలిసి కేక్ కట్ చేసి ఝాన్సీ లక్ష్మీబాయికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. విద్యారంగంలో విశేష సేవలందిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 300 మందికి పైగా రక్తదానం చేయడం సంతోషకరమని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రతి రక్తదాతను అభినందిస్తున్నానని తెలిపారు.

తలసేమియా బాధితులు, గర్భిణులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో అవసరమవుతుందని పేర్కొన్నారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని,స్వచ్ఛంద రక్తదానం ద్వారానే ఎంతోమంది ప్రాణాలను కాపాడగలమని వివరించారు. రక్తదానంపై ఉన్న అపోహలను వీడి, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు

అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- ఆసరా పెన్షన్ అర్హుల జాబితాను క్షేత్రస్థాయి పరిశీలనతో సిద్ధం చేయాలి
- సీఎస్ సంజయ్ జాజు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూసేకరణ పనులను వేగవంతం చేయాలి
- లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, తెలంగాణ చౌరస్తా:





ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రాధాన్యతా లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. విద్య, వీబీజీ రాంజీ పథకం, చేయూత పింఛన్ల పరిశీలన, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.శుక్రవారం సచివాలయం నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల నివారణకు ముందస్తు చర్యలు

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..పీఎం శ్రీ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేతిపంపుల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల నివారణ పనులను యుద్ధప్రాతిదికన చేపట్టాలని సూచించారు.వీబీజీ రాంజీ పథకం కింద కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామీణ రైతు కూలీలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. ఇటీవల ఒకే ఏడాదిలో అత్యధికంగా 5.38 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. జలసిరి పనులను విస్తృతంగా చేపట్టి నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

ఆసరా పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక దృష్టి

ఆసరా చేయూత పెన్షన్ల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి, అర్హులైన వారికే సంక్షేమ ఫలాలు అందేలా జాబితాలను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే గృహప్రవేశం చేసిన లబ్ధిదారులతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు దీపావళి వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

పరిహార వ్యత్యాసంపై రీ-అవార్డు అంశం పరిశీలన

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండలంలోని వెంకటాపురం రిజర్వాయర్‌కు సంబంధించి సుమారు 1,056 ఎకరాల భూసేకరణకు 2020లోనే అవార్డు జారీ చేసినప్పటికీ, నిధుల చెల్లింపులు జరగకపోవడంతో ప్రస్తుతం పరిహారంలో వ్యత్యాసం ఏర్పడిందని వివరించారు. ఆరేళ్లు గడిచిన నేపథ్యంలో భూయజమానులతో తిరిగి చర్చించి, నిబంధనల ప్రకారం రీఅవార్డు జారీ చేసే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. మొండిగౌరెల్లి భూసేకరణ కేసులో ఇటీవల అవార్డు జారీ చేశామని, త్వరలోనే పరిహారం చెల్లింపులు చేపడతామని కలెక్టర్ తెలిపారు. మిగిలిన పీజేపీసీ పరిధిలోని భూసేకరణ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని వెల్లడించారు.

ప్రతివారం శాఖల పనితీరుపై సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా శాఖల పనితీరుపై ప్రతివారం సమీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. హౌసింగ్, విద్యాశాఖలు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఏపీపోలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ వీబీజీ రాంజీ పథకం లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయి సిబ్బందితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, జెడ్పీ సీఈఓ కృష్ణా రెడ్డి, డీపీఓ సురేశ్ మోహన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్ రావు, హౌసింగ్ పీడీ చాంప్లా నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మచ్చలేని ఝాన్సీ రెడ్డి పై బురద చల్లితే ఊరుకోం

- ఝాన్సీ రెడ్డిపై ప్రతిపక్షాల ఆరోపణలు సరికాదు

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా

పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిపై ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొంతమంది కోవర్టులు ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, పట్టణ అధ్యక్షుడు ముద్ధసాని సురేష్ లు విమర్శించారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులు రాజకీయాల్లో రాకముందే తొర్రూరు డివిజన్ కేంద్రంలో కోట రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించారని, పాలకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అనేక సేవా కార్యక్రమాలు చేశారని, ఝాన్సీ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ మంత్రి దయాకర్ రావు కోవర్టులు దుష్ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. సోషల్ మీడియా,ఇతర పత్రికలలో వచ్చే కథనాలను పాలకుర్తి ప్రజలు నమ్మరని అన్నారు.ఇప్పటికైనా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి పై చేస్తున్న ఆరోపణలను మానుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బచ్చలి లక్ష్మణ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వల్లపు యాకయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మీర రమేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిత్తలూరు శ్రీనివాస్, చెవిటి సదాకర్ జాటోత్ రవి నాయక్,సోమవారం ఐలయ్య,ఎనగందుల శ్రీనివాస్,జాటోత్ సురేష్, దొంగరి శంకర్,వివిధ గ్రామాల సర్పంచులు పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు

హయత్‌నగర్‌లో వృద్ధుడు అదృశ్యం

- ఆచూకీ తెలిపితే పారితోషకం
- కుంట్లూరు రోడ్డులో చివరిసారిగా కనిపించిన చుంచు రాములు.. పోలీసులకు ఫిర్యాదు

ఎల్‌బీనగర్, తెలంగాణ చౌరస్తా:



హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 70 ఏళ్లు పైబడిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. అదృశ్యమైన చుంచు రాములు ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రంగా గాలిస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లయ్య కుమారుడైన చుంచు రాములు నవంబర్ 4వ తేదీన కుంట్లూరు రోడ్డులోని వై జంక్షన్, రాజధాని బ్యాంకు సమీపంలో చివరిసారిగా కనిపించారు. అక్కడి నుంచి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. అయినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు.వృత్తిరీత్యా రైతు అయిన రాములు ఎస్సీ కాలనీ ప్రాంతానికి చెందినవారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై నవంబర్ 5వ తేదీన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వివరాలు స్వీకరించారు.

ఆచూకీ తెలిపిన వారికి పారితోషకం

చుంచు రాములు ఎక్కడైనా కనిపించినా, ఆయనకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని కోరారు. ఆయన ఆచూకీ తెలిపి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో సహకరించిన వారికి తగిన పారితోషకం అందజేస్తామని ప్రకటించారు.

సమాచారం అందించాల్సిన ఫోన్ నంబర్లు:

95731 58136
76719 08388

వృద్ధుడి ఆచూకీ కనుగొని క్షేమంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అశ్వారావుపేటను ముంచెత్తిన మురసు తుఫాన్

- గండిపడిన వెంకమ్మ చెరువును పరిశీలించిన మంత్రి |తుమ్మల నాగేశ్వరరావు
- పంటలు, దెబ్బతిన్న రహదారులపై తక్షణ నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

మురసు తుఫాన్ ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ఆకస్మిక వరదలు సంభవించి పంట పొలాలు నీట మునిగాయి. వరదల కారణంగా గండిపడిన స్థానిక వెంకమ్మ చెరువును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించిన మంత్రి.. నీట మునిగిన పంట పొలాలు, దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు.

వాగులు, వంకలు పొంగిపొర్లి భారీ నష్టం

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మురసు తుఫాన్ కారణంగా అశ్వారావుపేట ప్రాంతంలో అత్యంత భారీ వర్షపాతం నమోదైందన్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ఆకస్మిక వరదలు సంభవించి వరి, ఉద్యాన పంటలు నీట మునిగాయని, రైతులకు భారీ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో రహదారులు సైతం దెబ్బతిన్నాయని తెలిపారు.

సాయంత్రంలోగా నష్టంపై నివేదిక ఇవ్వాలి

పంట నష్టం, దెబ్బతిన్న రహదారుల వివరాలతో పాటు మరమ్మతు పనులకు సంబంధించిన సమగ్ర నివేదికను శుక్రవారం సాయంత్రంలోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. తుఫాన్ కారణంగా జరిగిన నష్టంపై సమగ్ర నివేదిక రూపొందించి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తామని తెలిపారు.

పామాయిల్ సాగుకు నష్టం లేకపోవడం విశేషం

అత్యంత భారీ వర్షాలు, వరదలు సంభవించిన ప్పటికీ పామాయిల్ పంటకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా నిలబడటం విశేషమని మంత్రి పేర్కొన్నారు. అతివృష్టి, అనావృష్టి వంటి వాతావరణ పరిస్థితులు తరచూ ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో పామాయిల్ సాగు రైతాంగానికి వరంగా మారుతోందని ఈ పరిణామం మరోసారి నిరూపించిందన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, పంట నష్టం అంచనా, రహదారుల పునరుద్ధరణ, చెరువుల మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతామని మంత్రి స్పష్టం చేశారు.



తుఫాన్ ప్రభావిత వార్డుల్లో వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు పర్యటన

- 14, 17వ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యల ఆరా
- త్వరలోనే నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడతాం
- మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణాన్ని మురసు తుఫాన్ అతలాకుతలం చేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని 14, 17వ వార్డులు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, బాధిత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించిన ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. నిలిచిపోయిన వర్షపు నీరు, దెబ్బతిన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుఫాన్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ..ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.త్వరలోనే ఆయా వార్డుల్లో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. తుఫాన్ బాధితులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనను కాంగ్రెస్ నాయకులు దగ్గరుండి పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు జూపల్లి ప్రమోద్, 10వ వార్డు కౌన్సిలర్ బాబు, 18వ వార్డు కౌన్సిలర్ తిరుమలశెట్టి వెంకన్నబాబు, బీజేపీ నాయకురాలు, 17వ వార్డు కౌన్సిలర్ పమిడి గీత శ్రీ, కాంగ్రెస్ యువజన నాయకులు దండబత్తుల నరేష్, కాసాని పద్మశేఖర్, 22వ వార్డు కౌన్సిలర్ నార్లపాటి దివాకర్, 19వ వార్డు కౌన్సిలర్ జిలుగు రవీంద్ర కుమార్, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కురిసెట్టి నాగబాబు నాయుడు, తోకల హరీష్ గుప్తా, అశ్వారావుపేట మున్సిపల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పసుపులేటి ఫణీంద్ర, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాదిగ విద్యార్థుల ఐక్యతే లక్ష్యం


- ఈ నెల 8న ఎంఎస్ఎఫ్ మండల కమిటీ ఎన్నికలు
- పెద్ద సంఖ్యలో తరలిరావాలని నాయకుల పిలుపు

కమలాపూర్, తెలంగాణ చౌరస్తా:

మాదిగ విద్యార్థులను సంఘటితం చేసి, వారిలో సామాజిక, విద్యా చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) మండల కమిటీ ఎన్నికలకు సన్నాహాలు పూర్తయ్యాయి. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 8న కమలాపూర్ మండల కేంద్రంలో నూతన మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు ఎంఆర్‌పీఎస్ హనుమకొండ జిల్లా కోఇన్‌చార్జి తడుగుల విజయ్ మాదిగ వెల్లడించారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి మాదిగ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంఆర్‌పీఎస్ కమలాపూర్ మండల ఇన్‌చార్జి శనిగరపు రవేందర్ మాదిగ, మండల అధ్యక్షుడు గోల్కొండ శ్రీకాంత్ మాదిగ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కోఇన్‌చార్జిలు తడుగుల విజయ్ మాదిగ, బండారి సురేందర్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే హక్కులపై అవగాహన, సామాజిక బాధ్యత, సంఘటిత పోరాట స్ఫూర్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో మాదిగ విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి ఎంఎస్ఎఫ్ కమిటీలను ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఎంఎస్ఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ నెల 8న మధ్యాహ్నం 12 గంటలకు కమలాపూర్ కొత్త బస్టాండ్ ఆవరణలో నిర్వహించనున్న మండల కమిటీ ఎన్నికలకు విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు చిలువేరు సంపత్ మాదిగ, నద్దునూరి ప్రసాద్ మాదిగ, మండల అధ్యక్షుడు శనిగారపు చేరాలు మాదిగ, పుల్ల రవితేజ మాదిగ, ఇసంపల్లి రమేష్ మాదిగ, గన్నారపు చరణ్ మాదిగ, అంకిల్ల రామస్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.





రెండు బైకులు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- శనిగరం బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదం
- క్షతగాత్రులను ఎంజీఎంకు తరలింపు

కమలాపూర్, తెలంగాణ చౌరస్తా:

కమలాపూర్ మండలం శనిగరం గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. శనిగరం గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటరాజ్యం (60) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన మందాడి యశ్వంత్ (30), జన్నారపు కార్తీక్ (20) పని నిమిత్తం ముల్కనూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో శనిగరం బ్రిడ్జి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటరాజ్యం, యశ్వంత్‌లకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కార్తీక్‌కు ఎడమ భుజం వద్ద చేయి విరిగింది. సమాచారం అందుకున్న కమలాపూర్ 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ ఉపేందర్, పైలట్ గురునాథ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు





ప్రభుత్వ భూముల విక్రయాలను సహించేది లేదు

- ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడుకుంటాం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, తెలంగాణ చౌరస్తా:

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించనివ్వబోమని హెచ్చరించారు.శుక్రవారం కేపీహెచ్‌బీ భూముల విక్రయాల అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో సుమారు రూ.2,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మహిళా పార్కులు, చిల్డ్రన్ పార్కులు, ఇండోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలు తదితర ప్రజా ఉపయోగకరమైన సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు.ప్రజల భవిష్యత్ అవసరాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ భూములను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విక్రయానికి పెట్టడం సరికాదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన భూములను అమ్మకానికి సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. విశాలమైన కేపీహెచ్‌బీ కాలనీలో ఇప్పటికీ ఫైర్ స్టేషన్ లేదని, ప్రజలకు అవసరమైన పెట్రోల్ బంకు కోసం కేటాయించాల్సిన స్థలాన్ని కూడా విక్రయానికి పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.ఇప్పటికే నగరంలో విద్యుత్, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ప్రభుత్వ భూములను విక్రయించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, విలేకరులపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని వ్యాఖ్యానించారు. హౌసింగ్ బోర్డు భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం భూముల విక్రయాలకు ముందడుగు వేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని,బెందర్లలో పాల్గొనే ప్రయత్నాలను సైతం అడ్డుకుంటామని హెచ్చరించారు.ప్రాణాలకు తెగించి అయినా ప్రజల ఆస్తులైన ప్రభుత్వ భూములను కాపాడుకుంటామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు

- 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం.. 16 లీటర్ల గుడుంబా స్వాధీనం

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా



గుడుంబా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు తొర్రూరు పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. తొర్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుడిబండ తండా,గున్యా తండాల్లో శుక్రవారం తెల్లవారుజామున ఎస్సై మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా స్థావరాలపై మెరుపు దాడులు చేపట్టారు.ఈ తనిఖీల్లో నలుగురు వ్యక్తులకు సంబంధించిన స్థావరాల్లో అక్రమంగా గుడుంబా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 200 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే 16 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.



వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్

- రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- సుధాకర్

సైదాపూర్, తెలంగాణ చౌరస్తా:

రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ సూచించారు.సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, లస్మన్నపల్లి, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో వెన్నంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెన్నంపల్లి పీఏసీఎస్ చైర్మన్ పంతంగి రవీందర్ గౌడ్‌తో కలిసి కొనుగోలు కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం మార్కెట్ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందడంతో పాటు ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కోరారు.ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు అవసరమైన సహకారం అందించాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సీఈఓ ముల్లారెడ్డి, సర్పంచులు చిరంజీవి, స్వప్న, లావణ్య, అనిత, శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, పీఏసీఎస్ సిబ్బంది భాస్కర్ రెడ్డి, సుశీల, అనిల్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, డైరెక్టర్లు, రైతులు క్రాంతికుమార్, చోటే, చల్లూరి రవీందర్, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నడిగడ్డ తండా, సుభాష్ చంద్రబోస్ నగర్ అభివృద్ధికి గాంధీ ప్రత్యేక చొరవ



- సర్వీస్ రోడ్డు, యూజీడీ పనులకు అనుమతులు ఇవ్వాలని సీఆర్‌పీఎఫ్ అధికారులకు విజ్ఞప్తి

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండా, సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి,మౌలిక వసతుల కల్పనకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కాలనీల అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.శుక్రవారం వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, సీఆర్‌పీఎఫ్ దక్షిణ విభాగం ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై పలు అభివృద్ధి పనులపై చర్చించారు.నడిగడ్డ తండాలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణ పనులతో పాటు భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పైప్‌లైన్ పనులు చేపట్టేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సీఆర్‌పీఎఫ్ అధికారులను కోరారు. అదేవిధంగా మియాపూర్ మెట్రో పిల్లర్ నంబర్ 600 నుంచి మెట్రో స్టేషన్ వరకు మధ్యలో నిలిచిపోయిన సర్వీస్ రోడ్డు నిర్మాణానికి సీఆర్‌పీఎఫ్ అధీనంలోని స్థలంలో అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ సర్వీస్ రోడ్డు అందుబాటులోకి వస్తే మియాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణికులు, వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గాంధీ వివరించారు. నడిగడ్డ తండా నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బొల్లారం రోడ్డు వరకు మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యూజీడీ పనులకు అనుమతులు లభిస్తే వెంటనే పనులు పూర్తి చేసి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.కాలనీల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. ఆయన చేసిన విజ్ఞప్తులపై సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు సానుకూలంగా స్పందించారు.ఈ సమావేశంలో ఎస్ఈ శ్రీకాంతిని,డీఈ బాలమురళి, ఏఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి
- ఎస్ఐ దేవ్ సింగ్

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అశ్వారావుపేట ఎస్ఐ దేవ్ సింగ్ సూచించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు.అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ దేవ్ సింగ్ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, యూపీఐ లావాదేవీలు, నకిలీ లింకులు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల గురించి వివరించి అవగాహన కల్పించాలని ఎస్ఐ దేవ్ సింగ్ కోరారు.

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడిగా చిప్పలపల్లి నాగరాజు



- రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన కమిటీ ఏర్పాటు

రామన్నపేట, తెలంగాణ చౌరస్తా:

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) కళాశాల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ ఆధ్వర్యంలో ఈ కమిటీని నియమించారు.
ఈ సందర్భంగా దుబ్బ రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వం కోసం జరిగే పోరాటాల్లో విద్యార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగే ప్రతి ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.

నూతన కమిటీ వివరాలు:

అధ్యక్షుడు: చిప్పలపల్లి నాగరాజు మాదిగ
ఉపాధ్యక్షుడు: పోకల శివ మాదిగ
ప్రధాన కార్యదర్శి: ప్రమోద్ మాదిగ
కార్యవర్గ సభ్యులు: సాయి, రవి
ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు యాకరి నర్సింగరావు, సోమవరపు శంకర్ మాదిగ, శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యామ్నాయం చూపకుండా పేదల గుడిసెలు తొలగించవద్దు

- నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాం
- కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

నిరుపేద కుటుంబాలకు ప్రత్యామ్నాయ వసతి కల్పించకుండా వారి గుడిసెలను తొలగించి రోడ్డున పడేయడం సరికాదని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. పేదల జీవనోపాధి, కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.ఓల్డ్ ఎంఐజీ ప్రధాన రహదారిలో రైల్వే ట్రాక్ పక్కన గత కొన్నేళ్లుగా పూరి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేద కుటుంబాల గుడిసెలను దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రైల్వే రక్షక దళం సిబ్బంది జేసీబీలతో తొలగించేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్‌తో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకుని అధికారులతో చర్చలు జరిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలో పనులు చేసుకుంటూ,కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్న పేద కుటుంబాల పరిస్థితిని అధికారులు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రత్యామ్నాయ వసతి చూపకుండా గుడిసెలు తొలగించడం వల్ల చిన్నారులు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని భరోసా ఇచ్చారు. పేదల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, శేరిలింగంపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,శ్రీకాంత్ దేవులపల్లి,మహేందర్ సింగ్, కార్యకర్తలు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అమెరికా దేశస్థుడి అనుమానాస్పద మృతి

- గచ్చిబౌలిలోని మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌లో ఘటన..
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:



హైదరాబాద్‌లో అమెరికాకు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ టెర్మినస్ మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన మిచెల్ బ్రియాన్ లీ (41) మృతి చెందాడు.
వ్యాపార పనుల నిమిత్తం తన భాగస్వామి డేవిడ్‌తో కలిసి నవంబర్ 2న హైదరాబాద్‌కు వచ్చిన మిచెల్ బ్రియాన్ లీ మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌లో బస చేస్తున్నాడు. అయితే నవంబర్ 4వ తేదీ సాయంత్రం నుంచి ఆయన ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో గురువారం సాయంత్రం హోటల్ సిబ్బంది అనుమానంతో గది తలుపులు తెరిచి చూశారు.అప్పటికే ఆయన మంచంపై అపస్మారక స్థితిలో కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 వైద్య సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మిచెల్ బ్రియాన్ లీ మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



ప్రత్యామ్నాయం చూపకుండా పేదల గుడిసెలు తొలగించవద్దు

- నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాం
- కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

నిరుపేద కుటుంబాలకు ప్రత్యామ్నాయ వసతి కల్పించకుండా వారి గుడిసెలను తొలగించి రోడ్డున పడేయడం సరికాదని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. పేదల జీవనోపాధి, కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.ఓల్డ్ ఎంఐజీ ప్రధాన రహదారిలో రైల్వే ట్రాక్ పక్కన గత కొన్నేళ్లుగా పూరి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేద కుటుంబాల గుడిసెలను దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రైల్వే రక్షక దళం సిబ్బంది జేసీబీలతో తొలగించేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్‌తో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకుని అధికారులతో చర్చలు జరిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలో పనులు చేసుకుంటూ,కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్న పేద కుటుంబాల పరిస్థితిని అధికారులు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రత్యామ్నాయ వసతి చూపకుండా గుడిసెలు తొలగించడం వల్ల చిన్నారులు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని భరోసా ఇచ్చారు. పేదల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, శేరిలింగంపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,శ్రీకాంత్ దేవులపల్లి,మహేందర్ సింగ్, కార్యకర్తలు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

నిజమైన భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- కాసిపేటలో నష్టపరిహారం అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- తహసీల్దార్‌కు వినతి

కాసిపేట, తెలంగాణ చౌరస్తా:

కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ పరిహారం పంపిణీలో అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కాసిపేట మండల తహసీల్దార్‌కు పలువురు వినతిపత్రం సమర్పించారు.కాటేపేట శివారు పరిధిలోని సర్వే నంబర్లు 146, 147లో కొంతమంది ఇతర ప్రాంతాలకు చెందిన భూముల పట్టాలు, నకిలీ పట్టాలను ఉపయోగించి కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో తమ భూములు కోల్పోయినట్లు చూపించి భారీ మొత్తంలో నష్టపరిహారం పొందినట్లు వినతిపత్రంలో ఆరోపించారు. అంతేకాకుండా పరిహారం పొందిన తర్వాత కూడా అదే భూములను సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.ఈ వ్యవహారం వల్ల నిజమైన భూ నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అర్హులైన బాధితులకు నష్టపరిహారం అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వాన్ని, అధికారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ నిధులను అక్రమంగా పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,అసలైన బాధితులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్,మాజీ ఎంపీటీసీ బూట్ల వెంకటలక్ష్మి,ఇస్లావత్ రాజేశం పాల్గొన్నారు.

